జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

మంగళవారం | 08-09-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 777 పేజీలు: 4 వెల : రూ.7

# స్థానిక సంస్థల పోరుకు.. సై



* కూటమి వైఫల్యాలను ఎండగడతాం
* జిల్లాలో ప్రత్యేకంగా 'డిజిటల్ బుక్ కమిటీ'
* మాజీ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, కృష్ణదాస్
* నేటి నుంచి మండల, వార్డు స్థాయి సమావేశాలు
* 23 నుంచి 'ఇంటింటికీ ప్రచారం'
* వైసీపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశం
* తరలివచ్చిన మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులు, కార్యకర్తలు



శ్రీకాకుళం, సెప్టెంబర్7 (వార్త): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావులు పిలుపునిచ్చారు. శ్రీకాకుళంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో సోమవారం వైయస్సార్‌సీపీ విస్తృత స్థాయి జిల్లా కార్యవర్గ సమావేశంలో పెద్ద ఎత్తున మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో నాయకులు, కార్యకర్తలు పరస్పర సమన్వయంతో పనిచేసి పార్టీ విజయానికి బాటలు వేయాలన్నారు. వైయస్సార్‌సీపీ శ్రేణులను ఇబ్బంది పెడుతున్న కూటమి నాయకులు, అధికారుల వివరాలను నమోదు చేయడానికి జిల్లాలో ప్రత్యేకంగా 'డిజిటల్ బుక్ కమిటీ'ని ఏర్పాటు చేసినట్లు స్పష్టం చేశారు. ఈనెల 8 నుంచి 11 వరకు అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి సమావేశాలు, 12 నుంచి 22 వరకు మండల, వార్డు స్థాయి సమావేశాలు, 23 నుంచి గ్రామ, వార్డు నాయకుల ఆధ్వర్యంలో 'ఇంటింటికీ ప్రచారం' ప్రారంభమవుతుందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో అందించిన సంక్షేమ ఫలాలను ప్రజలకు గుర్తుచేస్తూ, కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టే ప్రచార పుస్తకాలను ఇంటింటికీ పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమం అనంతరం పార్టీ క్రియాశీలక నాయకులకు అధికారిక గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు, జిల్లా పరిశీలకులు కుంబా రవిబాబు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయలక్ష్మి, ఎమ్మెల్సీలు పెనుమర్తి సురేష్ బాబు, నర్తు రామారావు, పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యేలు రెడ్డి శాంతి, గొర్లె కిరణ్ కుమార్, మీసాల నీలకంఠం నాయుడు, టెక్కలి సమన్వయకర్త పేరాడ తిలక్, నేతలు చింతాడ రవికుమార్, సాడే శ్యాంప్రసాద్ రెడ్డి తదితరులు హాజరయ్యారు.



## హైకోర్టు దెబ్బకు
# పెండింగ్ బిల్లుల మంజూరు

* పనులు పూర్తయినా బిల్లులు చెల్లింపుల్లో తాత్సారం
* అధికారుల చుట్టూ కాంట్రాక్టర్ల పడిగాపులు
* చివరకు న్యాయస్థానంలో రిట్ పిటిషన్
* అధికారులపై సీరియస్ అయిన ఉన్నత న్యాయస్థానం
* బిల్లుల చెల్లింపునకు సిద్ధమైన అధికారులు
* ఎట్టకేలకు కాంట్రాక్టర్లకు న్యాయం

శ్రీకాకుళం, సెప్టెంబర్ 7 (వార్త): ప్రత్యేక అభివృద్ధి నిధుల కింద శ్రీకాకుళం జిల్లా పరిధిలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులతో పాటు ప్రభుత్వ శాఖలకు అవసరమైన యంత్రాలు, పరికరాలను సరఫరా చేసిన కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన బకాయిల కోసం అధికారులు తిప్పించుకుంటున్నారు. పనులు పూర్తి చేసి, యంత్రాలను అప్పగించిన తర్వాత చెల్లించాల్సిన నిధుల కోసం కాంట్రాక్టర్లు కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ఫలితం లేకుండా పోయింది. బిల్లుల ప్రక్రియ పూర్తయి సమగ్ర ఆర్థిక యాజమాన్య విధానంలో టోకెన్ నంబర్లు కూడా కేటాయించినప్పటికీ నిధులు విడుదల చేయకపోవడంతో, విసిగిపోయిన కాంట్రాక్టర్లు రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో రిట్ పిటిషన్లు (డబ్ల్యూపీ నంబర్లు 30698/2022, 31122/2022, 31085/2022, 31230/2022, 8924/2024, 8809/2024) దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం న్యాయమూర్తి జస్టిస్ డి. రమేష్, అధికారుల అలసత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, పరిశీలన ప్రక్రియ పూర్తి చేసి నిర్దేశిత వ్యవధిలోగా బాకీ పడిన మొత్తాలను చెల్లించాలని స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేశారు. కోర్టు ఆదేశాలను అమలు చేయకపోవడంతో నమోదైన కోర్టు ధిక్కార పిటిషన్ (సీసీ నంబర్ 213/2024) తీవ్ర రూపం దాల్చడంతో ఎట్టకేలకు సీరియస్‌గా స్పందించిన ప్రభుత్వం చెల్లింపులకు అంగీకరించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రణాళికా శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం రూ. 46,13,384 నిధులకు పరిపాలనా మంజూరు ఇచ్చారు. శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా అర్థగణాంక అధికారి వ్యక్తిగత డిపాజిట్ ఖాతా ద్వారా ఈ నిధులను సంబంధిత ఏజెన్సీలకు జమ చేయాలని ఆదేశించడంతో ఎట్టకేలకు కాంట్రాక్టర్లకు న్యాయం చేకూరింది.

## వానాకాలంలో..
# భగభగ



* నీరు లేక ఎండిపోతున్న నారుమడులు
* ఉక్కపోతతో వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు
* పగటిపూట 40 డిగ్రీలు నమోదు
* అప్రకటిత విద్యుత్ కోతలు

శ్రీకాకుళం, సెప్టెంబర్7 (వార్త): వేసవి పూర్తియినా రెండో వేసవి మొదలైందా అన్నట్లుగా పరిస్థితి మారింది. పగటి ఉష్ణోగ్రతల్లో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పగటి ఉష్ణోగ్రత 40 డిగ్రీలకు చేరుకోవటంతో అటు ఎండకు, ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. గత వారం రోజులుగా పెరుగుతున్న ఎండలు ఇప్పుడు వేసవిని తలపిస్తున్నాయి. వడగాల్పులు కొనసాగుతున్నాయి. సాధారణం కంటే ఉష్ణోగ్రతలు పెరుగుతుండటం వలన ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ప్రతీ ఏటా సాధారణంగా జూన్ నెల నుంచి వానలు ప్రారంభం కావాల్సి ఉన్నప్పటికీ ఇప్పటి వరకు వానలు అంతంత మాత్రమే ఉన్నాయి. వర్షాలు కురియకపోవటంతో రైతులు కూడా దిగాలు చెందుతున్నారు. వర్షాలు సకాలంలో పడాలని రైతులతో పాటు ప్రజలు ఆలయాల్లో పూజలు, జలాభిషేకాలు చేస్తున్నారు.

### ఎండ తీవ్రతకు వృద్ధురాలి మృతి

జలుమూరు, సెప్టెంబర్ 7 (వార్త): జలుమూరులోని ఎస్సీ వసతి గృహం సమీపంలోని పంట పొలంలో బత్తిలి మాణిక్యం మృతి చెందినట్టు స్థానికులు గుర్తించారు. మాణిక్యం ఇటీవల తిలారులో నివాసం ఉంటున్న తన కుమార్తె ఇంటికి వెళ్లినట్లు తెలిసింది. అక్కడి నుంచి తిరిగి స్వగ్రామానికి వస్తున్న క్రమంలో ఎండకు తాళలేక మృతి చెంది ఉంటుందని కుటుంబీకులు చెబుతున్నారు. జలుమూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేేస్తున్నారు.

### అర్ధరాత్రి వరకు కరెంటు కోత

సోంపేట, సెప్టెంబర్ 7 (వార్త): విద్యుత్ శాఖ అధికారులు ప్రజలకు నరకం చూపిస్తున్నారు. సోంపేట సబ్ డివిజన్ పరిధిలో కంచిలి, కవిటి, ఇచ్ఛాపురం మండలాలతో పాటు మున్సిపాలిటీలో కరెంటు కోతతో జనం ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఎల్ నినో ప్రభావంతో తీవ్రమైన ఉష్ణోగ్రతలు ఒకవైపు మరోవైపు దోమల దాడులతో కంటిపై కునుకు లేకుండా జనం నానా ఇబ్బందులు పడ్డారు. శనివారం రాత్రి 8:30 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు కరెంట్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు పడిన బాధలు వర్ణనాతీతం. ఈ విషయమై విద్యుత్ శాఖ స్థానిక అధికారులకు చాలామంది ఫోన్లు చేసే ప్రయత్నం చేసినప్పటికీ ఒక్కరు ఫోన్ కూడా అందుబాటులో లేకపోవడం గమనార్హం. సంబంధిత అధికారులు, సిబ్బంది తమ ఫోన్ లను ఫ్లైట్ మోడ్ లో పెట్టడంతో ఫోన్ చేసిన ప్రతి ఒక్కరికి ప్రస్తుతం అందుబాటులో లేరు అన్న సమాధానం ఎదురయింది. అధిక ఉష్ణోగ్రతలకు విద్యుత్ శాఖ యాజమాన్యం ఎమర్జెన్సీ లోడ్ రిలీఫ్ పేరిట కోత విధించిందని ఆ తర్వాత రోజు ఆ శాఖ అధికారులు చల్లగా చెప్పడం గమనార్హం. అధికారికంగా ఎటువంటి ప్రకటన చేయకుండా గంటలపాటు కోతలు విధించడం పట్ల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## కొత్త పింఛన్లకు దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం



**జి.సిగడాం, సెప్టెంబరు 7(వార్త):** స్వర్ణ గ్రామ సచివాలయాల ద్వారా ఎన్టీఆర్ భరోసా పథకానికి సంబంధించి కొత్త పింఛన్లకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైనట్లు ఎంపీడీవో జి. రామకృష్ణారావు తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం జారీ చేసిన మెమో నెం. 3407491, 2026 సెప్టెంబరు 6 మార్గదర్శకాల మేరకు ఈ ప్రక్రియ కొన సాగుతుందని పేర్కొన్నారు. సోమవారం నుంచి ప్రారంభం కాగ 16వ తేదీ వరకు డిజిటల్ అసిస్టెంట్ల ద్వారా దరఖా స్థుల ఆన్లైన్ నమోదు, ఈకేవైసీ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. 17 నుంచి 21వ తేదీ వరకు సంక్షేమ, విద్యా సహాయకులు (డబ్ల్యూఈఏ)లు తమ లాగిన్ ద్వారా దరఖాస్తు ఫారాలను ప్రింట్ తీసుకుని క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించి, వివరాలను ఆన్లైన్ లో అప్లోడ్ చేయాలన్నారు. పరిశీలన అనంతరం వృద్ధాప్య, వితంతు, దివ్యాంగుల దరఖాస్తులను ఎంపీడీవోకు, ఒంటరి మహిళల దరఖాస్తులను తహసీల్దార్, చేనేత, మత్స్యకారులు తదితర కులవృత్తులకు సంబంధించిన దరఖాస్తులను సంబంధిత జిల్లా స్థాయి అధికారులకు లాగిన్ ద్వారా ఫార్వర్డ్ చేయాలని ఆయన ఆదేశించారు. దరఖాస్తుతో పాటు ఆధార్, రైస్ కార్డు గానీ ఆదాయ ధ్రువీకరణ పత్రం గానీ, సంబంధిత కేటగిరి సర్టిఫికెట్లను తప్పనిసరిగా పరిశీలించాలని ఆయన సూచించారు. నిర్ణీత గడువులోగా ఎలాంటి జాప్యం లేకుండా ప్రక్రియను పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు.

## పెన్షన్ దరఖాస్తులకు జనసేన అండ



**పలాస, సెప్టెంబరు 7(వార్త):** సంక్షేమ పథకాల అమలులో భాగంగా అర్హులైన వారికి పెన్షన్ అందేలా దరఖాస్తు ప్రక్రియలో సహకరించేందుకు జనసేన నాయకులు ముందుకొచ్చారు. 36వ వార్డు పురుషోత్తపురం--2 సచివాలయంలో పెన్షన్ లబ్ధిదారుల దరఖాస్తులకు సహాయక కార్యక్రమం నిర్వహించారు. దరఖాస్తుల నమోదుతోపాటు అవసరమైన వివరాలు, ధ్రువపత్రాల సమర్పణపై లబ్ధిదారులకు అవగాహన కల్పించారు.

### సంక్షేమంపై రాజకీయ దృష్టి?

ఎన్నికల నేపథ్యంలో సంక్షేమ పథకాలు, పెన్షన్ల దరఖాస్తుల ప్రక్రియ రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంటున్న వేళ ఈ కార్యక్రమం నిర్వహించడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. లబ్ధిదారుల దరఖాస్తులకు సహకరించడం, వారికి ప్రభుత్వ ప్రక్రియపై అవగాహన కల్పించడం కార్యక్రమం ప్రధాన ఉద్దేశంగా నిర్వాహకులు వెల్లడించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ నిబంధనల మేరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గౌతు శిరీషతోపాటు యార్లగడ్డ వెంకన్న చౌదరి, యార్లగడ్డ దుర్గారావు, వేగులాడ భాస్కరరావు, మజ్జి పిసిని చంద్ర మోహన్, కనిటి కిరణ్, పెదాడ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## పల్లెలు ప్రశాంతతకు నిలయం కావాలి



**మందస, సెప్టెంబరు 7(వార్త):** పల్లెలు ప్రశాంతానికి నిలయం కావాలని, శాంతి, భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కాశీబుగ్గ డీఎస్పీ టి.భవాని పిలుపునిచ్చారు. మందస మండలంలోని ఉద్దాన ప్రాంతమైన రాంపురంలో పల్లెనిద్ర నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎస్పీ భవాని మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రశాంత వాతావరణం ఉండేలా సహకరించాలని కోరారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడవద్దని హితవు పలికారు. పోలీసులు ప్రజలకు మిత్రులను, వారి సేవలను సద్వినియోగం చేసుకోవాలని కొరారు. పోలీసులు ప్రజలకు చేరువగా ఉంటారని, సమస్యలను తెలియజేయాలన్నారు. శాంతిభద్రతలను పటిష్ఠం చేసేందుకు పోలీసులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో కాశీబుగ్గరూరల్ సీఐ ఎం.తిరుపతిరావు, మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం సమస్యలు, భద్రతా అంశాలపై ప్రజల అభిప్రాయాలను సేకరించారు. సైబర్ నేరాలు, వివిధ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

## సోములయ్యకు శ్రీశ్రీ కళావేదిక అవార్డు



**మందస, సెప్టెంబరు 7(వార్త):** ఉపాధ్యాయ రంగంలో విశేష సేవలు అందిస్తూ.. కవిగా మంచి పేరును సవర సోములయ్య సంపాదిస్తున్నారు. ఇప్పటికే సోములయ్య పలు అవార్డులు, రివార్డులను సాధించారు. తాజాగా శ్రీశ్రీ కళావేదిక నిర్వహించిన ప్రత్యేక కవితా పోటీల్లో పాల్గొని అవార్డు పొందారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శ్రీశ్రీ కళావేదిక ప్రతినిధులు గురుదేవోభవ అనే అంశంపై కవితా పోటీలు నిర్వహించారు. సోములయ్య తన ప్రతిభాశక్తితో సృజనాత్మకంగా కవితను రాసారు. తెలుగు భాష, తెలుగు సంస్కృతి, తెలుగు వైభవం, తెలుగు సాహిత్యం, తెలుగు కళలుకోసం పనిచేస్తున్న అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ సోములయ్య కవితను అవార్డుకు ఎంపిక చేసింది. శ్రీ శ్రీ కళావేదిక ద్వారా ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కవితా పోటీలో 63 మంది కవులు కవయిత్రిలు గురుదేవోభవ కవితా పోటీల్లో పాల్గొన్నారు. మందస మండలంలోని కొంకాడాపుట్టి పంచాయతీలోని కిల్లోయికాలనీకి చెందిన ఉపాధ్యాయుడు సవర సోములయ్య అవార్డు సాధించడంతో గిరిజన సంఘాలు, నాయకులు హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా సోములయ్య మాస్టారుకు వారంతా అభినందనలు తెలిపారు.

## గ్యాస్ గడువు తగ్గింపుపై హర్షం



**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 7(వార్త):** గ్రామీణ మున్సిపాలిటీ ప్రాంత ప్రజలకు గొప్ప శుభవార్త అని ఇప్పుడు గ్యాస్ బుకింగ్ గడువు 45 నుంచి 25 రోజులకు తగ్గింపు చేసారని రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ కొండ శంకర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న గ్యాస్ సిలిండర్ బుకింగ్ ఇబ్బందులను తొలగిస్తూ, బుకింగ్ గడువును 45 రోజుల నుండి 25 రోజులకు తగ్గిస్తూ ప్రభుత్వం తీసుకున్న ప్రజానుకూల నిర్ణయం పట్ల చొరవ చూపి, నిరంతరం ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తున్న కేంద్ర సహాయ మంత్రి సురేష్ గోపి కి, కేంద్ర మంత్రివర్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు కి, ఇచ్ఛాపురం శాసనసభ్యులు డాక్టర్ బెందాలాం అశోక్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ప్రజల శ్రేయస్సే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందడుగు వేస్తోందని ఈ సందర్భంగా తెలిపారు.

# ఉద్దానం ఆత్మబంధువు ఎర్రన్నాయుడు

**- 'ఉద్దానం బంధు' బిరుదును ఎర్రన్నాయుడికి అంకితం చేసిన మాజీ మంత్రి శివాజీ**

**- ఉద్దానం కళలు, సాహిత్య పరిరక్షణకు**

**వేదిక కృషి అభినందనీయం**



**పలాస, సెప్టెంబరు 7(వార్త):** ఉద్దానం ప్రాంత అభివృద్ధికి విశేషంగా కృషి చేసిన దివంగత కింజరాపు ఎర్రన్నాయుడు ఉద్దానం ఆత్మబంధువని మాజీ మంత్రి, సీనియర్ ప్రజాప్రతినిధి గౌతు శ్యామసుందర శివాజీ అన్నారు. తనకు ప్రదానం చేసిన 'ఉద్దానం బంధు' బిరుదును ఎర్రన్నాయుడికి అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు. ఉద్దానం సాహితీ సాంస్కృతిక వేదిక తొమ్మిదో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వజ్రపుకొత్తూరు మండలం అక్కుపల్లిలో శ్రీరామ సేవా సంఘం సౌజన్యంతో నిర్వహించిన కీ.శే. మండలి వెంకట కృష్ణారావు శతజయంతి ఉత్సవాల్లో శివాజీని ఘనంగా సత్కరించి 'ఉద్దానం బంధు' బిరుదును ప్రదానం చేశారు.

ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ ఉద్దానం ప్రాంత కళలు, సాహిత్యం, సంస్కృతిని పరిరక్షిస్తూ వాటికి తగిన గుర్తింపు తీసుకురావడంలో ఉద్దానం సాహితీ సాంస్కృతిక వేదిక చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఏటా కళా, సాహిత్య రంగాలతోపాటు సమాజ సేవ, రాజకీయ రంగాల్లో విశేష సేవలందించిన వారిని గుర్తించి 'ఉద్దానం బంధు' బిరుదులతో సత్కరించడం ద్వారా సేవలను సమాజం గుర్తించేలా చేస్తున్నారని తెలిపారు. ఉద్దానం అభివృద్ధిలో ఎర్రన్నాయుడు పోషించిన పాత్రను శివాజీ గుర్తు చేసుకున్నారు. ప్రాంత ప్రజల సమస్యలు, అభివృద్ధి అవసరాలపై ఆయన చూపిన శ్రద్ధ చిరస్మరణీయమన్నారు. తనకు లభించిన గౌరవాన్ని ఆయనకు అంకితం చేయడం ద్వారా ఎర్రన్నాయుడిపై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు.

### ఘనంగా వార్షికోత్సవం

కార్యక్రమానికి ఉద్దానం సాహితీ సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు లండ రుద్రమూర్తి అధ్యక్షత వహించారు. వేదిక గౌరవాధ్యక్షుడు, సీనియర్ జర్నలిస్ట్ వంకల రాజారావు స్వాగతం పలికారు. కార్యదర్శి, సీనియర్ జర్నలిస్ట్ శివజ్యోతి వార్షిక నివేదికను సమర్పించి ఏడాది కాలంలో వేదిక నిర్వహించిన సాహితీ, సాంస్కృతిక కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమానికి సహకరించిన శ్రీరామ సేవా సంఘం, విజయ్ బ్రదర్స్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. శ్రీరామ సేవా సంఘం అధ్యక్షుడు మోస వరప్రసాద్ మాట్లాడుతూ వేదిక వార్షికోత్సవాన్ని తమ గ్రామంలో నిర్వహించేందుకు అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. వేదిక ప్రధాన సలహాదారు, కవి తెప్పల కృష్ణమూర్తి, కవి--రచయిత బమ్మిడి సుబ్బారావు, జానపద గాయకుడు దాసరి తాతారావు, ఎంపీపీ సురాడ మోహనరావు తదితరులు ప్రసంగించారు.

### సహకరించిన వారికి సత్కారం

వేదిక గతంలో నిర్వహించిన కార్యక్రమాలకు సహకరించిన వివిధ గ్రామాల ప్రముఖులు అంబటి రామకృష్ణ, కొండ భీమారావు మాస్టారును సత్కరించారు. విశాఖపట్నం నుంచి కార్యక్రమానికి హాజరైన ఆంధ్ర ఫోకస్ పత్రిక సబ్ఎడిటర్ పుక్కళ్ల కరుణను శాలువా, జ్ఞాపికతో ఘనంగా సన్మానించారు.

### ఏకపాత్రాభినయ పోటీల విజేతలకు బహుమతులు

ఈ సందర్భంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి ఏకపాత్రాభినయ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. చింతాడ గోవిందమ్మ ప్రథమ, బడగల శ్రీనివాసరావు ద్వితీయ, నల్లపాటి అన్నపూర్ణ తృతీయ బహుమతులు కైవాసం చేసుకున్నారు. ప్రోత్సాహక బహుమతులు బోనం గురుమూర్తి, నొక్కు కృష్ణారావు, దుర్గా శ్రీనివాసరావు, సింహాద్రి ధర్మారావు, బాలక లోకనాథ్‌కు అందాయి. న్యాయ నిర్ణేతలుగా బోయిన రమణమూర్తి, కుమార్ నాయక్ వ్యవహరించారు. వ్యాఖ్యాతగా సిస్టు మనోజ్‌కుమార్ వ్యవహరించారు. కార్యక్రమంలో వేదిక సభ్యులు బమ్మిడి సాంబమూర్తి, మోస చలపతి, అమ్మ రామకృష్ణ, మొరిపల్లి ధర్మారావుతోపాటు సాహితీవేత్తలు, కళాకారులు, ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల ప్రముఖులు, సాహితీ--సాంస్కృతిక అభిమానులు పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన జానపద సంబరాలు



**కవిటి, సెప్టెంబరు 7(వార్త):**కవిటి మండలం ఆర్.బెలగాంలో నాలుగు రోజులు గా శ్రీ మహతి సాంస్కృతిక కళాసేవ సంస్థ ఆధ్వర్యంలో శ్రీ జీరు పాపయ్య 36 వ వర్ధంతి పురస్కరించుకొని నిర్వహించిన జానపద సాంస్కృతిక సంబరాలు అన్ని వర్గాలను ఎంతగానో అలరించాయి. తొలి రోజు నుంచి చివరి వరకు జరి గిన వివిధ సాంగ్ సాంస్కృతిక కార్యక్రమాలకు వివిధ ప్రాంతాల నుంచి కళాభిమానులు కళాపోషకులు వీక్షకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సంబరాల్లో భాగంగా వివిధ రకాల జానపద కళా ప్రదర్శనలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఒడిస్సా ప్రాంత సంగీత కళాకారులచే సంగీత కార్యక్రమం, కచేరీలు, భజనలతోపాటు సాయంత్రం జానపదాలు, కూచిపూడి, భరతనాట్యం వంటి కార్యక్రమాలతో ఆర్ బెలగాంలో గల కళావేదిక వీక్షకులను ఎంతగానో తన్మయత్వానికి గురిచేసింది. జానపద కార్యక్రమాల ఆద్యంతము ప్రేక్షకులు ఎంతో ఉత్సాహంతో వీక్షించారు. అనంతరం పాల్గొన్న కళాకారులకు సన్మాన సత్కారాలు ఘనంగా నిర్వహించారు.విచ్చేసిన అతిధులు చేతులమీదుగా సన్మాన సత్కారాలు నిర్వహించారు. చివరి రోజున జానపద సంబరాలు నిమిత్తం ఆంధ్ర ఒడిశా ప్రాంతాల నుండి 25 కోలాట బృందాలచే అంగరంగ వైభవంగా ప్రదర్శించిన జానపద నృత్యాలు చేస్తూ ప్రేక్షకులను, కళాకారులను, అతిధులను మంత్రముగ్ధులను చేశాయి . ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆల్ ఇండియా కళా రంగం వ్యవస్థాపకులు మాదుగుల కుమార్, పూజారి బాలచందర్, బుర్రకథ వెంకటరమణ, ఇచ్చాపురం వైసీపీ ఇన్చార్జి సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి, నర్తు నరేంద్ర యాదవ్, కడియాల ప్రకాష్, జనసేన ఇచ్చాపురం ఇంచార్జి దాసరి రాజు, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి తిప్పన దుర్యోధన రెడ్డి, ఇచ్చాపురం మాజీ ఎంపీపీ దక్కత ఢిల్లీ రావు, ఆంధ్రప్రదేశ్ నాటక రంగ డైరెక్టర్ దక్కత కామేశ్వర్ రెడ్డి, బాసు రౌలో, రంగా రౌలో, జానపద కళాకారులు కుత్తుమ వినోద్, కుమార్ నాయక్ వంటి ప్రముఖుల చేతుల మీదుగా కళాకారులకు సత్కారాలు చేశారు. జానపద కళాకారులు గౌండ్యాల పుట్టుక వాస్తవ్యులు గేదెల ప్రకాష్, తేలుకుంచి వాస్తవ్యులు కారంగి పాపారావు ఇరువురికి జానపద పురస్కారాలు తో సన్మాన సత్కారాలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, శ్రీ మహతి సాంస్కృతిక కళా సేవా సంస్థ కార్యవర్గ సభ్యులు, గౌరవ సభ్యులు, నవోదయ యువజన సంఘం సభ్యులు, గ్రామ సేవకులు మహిళలు, కోలాట బృంద సభ్యులు ఆర్గనైజర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం జయప్రదం చేసిన ప్రతి ఒక్కరికి కార్యనిర్వాహకులు మహతి సాంస్కృతిక కళాసేవా సంస్థ వ్యవస్థాపకులు తిప్పన ధనంజయ రెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు.

## ఎంపీడీవో కుటుంబానికి వైసీపీ నేతల పరామర్శ



**కంచిలి, సెప్టెంబరు 7(వార్త):** కంచిలి ఎంపీడీవో వావిలాపల్లి తిరుమలరావు కుటుంబానికి కంచిలి ఎంపిపి పైల దేవదాసు రెడ్డి ఆధ్వర్యంలో పలువురు వైసిపి నేతలు సోమవారం ఆయన స్వగ్రామం మందస మండలం వెళ్లి పరామర్శించారు. ఎంపీడీవో తల్లి వజ్రం ఇటీవల మృతి చెందారు. ఆమె చిత్రపటం వద్ద నివాళులర్పించారు.వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

### కర్తలి గ్రామంలో...

కర్తలి గ్రామంలో పైల తాతయ్య ధనలక్ష్మి దంపతుల ఐదేళ్ల కుమారుడు హృషికేష్ ఇటీవల బోన్మారో వ్యాధితో బాధపడుతూ చనిపోవడంతో ఆ కుటుంబాన్ని కూడా సోమవారం పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎంపీడీవో పైల సూర్యనారాయణ, దుర్గాసి ధర్మారావు, కొల్లి ఈశ్వరరావు, పలికల జయరాం, మద్దు అభి, జామి జయ, గుడ్డి భద్ర వేణు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్దానం మహిళా జర్నలిస్టుకు ఘన సన్మానం

**పలాస, సెప్టెంబరు 7(వార్త):** ఉద్దానం ప్రాంతానికి చెందిన మహిళా జర్నలిస్టు పుక్కళ్ల కరుణకుమారిని మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ ఘనంగా సన్మానించారు. వజ్రపుకొత్తూరు మండలం అక్కుపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి ఉద్దానం సాహితీ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో, శ్రీరామ సేవా సంఘం సౌజన్యంతో నిర్వహించిన కార్యక్రమంలో ఆమెకు దుశ్శాలువ కప్పి జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న గౌతు శివాజీ మాట్లాడుతూ ఉద్దానం ప్రాంతంలో ప్రజా సేవకు, పోరాట స్ఫూర్తికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. తాను సుమారు 30



ఏళ్లుగా ఎమ్మెల్యేగా ఈ ప్రాంత ప్రజలకు సేవలందించిన విషయాన్ని గుర్తుచేసుకున్నారు. తన తండ్రి, మాజీ మంత్రి సర్దార్ గౌతు లచ్చన్న ఉద్దానం ప్రాంతానికి చెందిన అనేక పోరాటాలను, చారిత్రక ఘట్టాలను తరచూ ప్రస్తావించేవారని తెలిపారు. ఆయన చూపిన బాటలో నడుస్తూ ప్రజల మన్ననలు పొందడం తనకు సంతృప్తినిచ్చిందన్నారు. ఉద్దానం ప్రాంతానికి చెందిన కరుణకుమారి విశాఖపట్నంలో ఉంటూ మహిళా జర్నలిస్టుగా రాణించడం అభినందనీయమని శివాజీ కొనియాడారు. ఆంధ్ర ఫోకస్ పత్రిక సబ్ ఎడిటర్గా, రాష్ట్ర మత్స్యకార మహిళా సంఘం ఉపాధ్యక్షురాలిగా ఆమె చేస్తున్న సేవలను ప్రశంసించారు. ఉద్దానం మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావడానికి కరుణకుమారి వంటి వారు స్ఫూర్తిగా నిలుస్తారని తెలిపారు.

ఉద్దానం సాహితీ సాంస్కృతిక వేదిక తొమ్మిదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. సాహిత్యం, సంస్కృతి, సామాజిక అంశాలపై వేదిక చేపడుతున్న కార్యక్రమాలను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో వేదిక అధ్యక్ష, కార్యదర్శులు లండ రుద్రమూర్తి, శివజ్యోతి రాజారావు, నిశ్చితాసి, సూరాడ మోహన్‌రావు, దాసరి తాతారావు, అంబటి రామకృష్ణ, శ్రీరామ సేవా సంఘం అధ్యక్షుడు మోస వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రమించాడు.. సాధించాడు..

**- డాక్టర్ సీటు పొందిన మురపాల గణేశ్ - అభినందిస్తున్న ప్రజలు**



**మందస, సెప్టెంబరు 7(వార్త):** ఎంబీబీఎస్ సీటు సాధించడమంటే ఎంతో శ్రమించాలి.. కష్టపడాలి.. కృషి, పట్టుదల, అంకితభావం కలిగి ఉండాలి.. లక్ష్యాన్ని చేరుకోవాలన్న తపన ఉండాలి.. వీటికి తోడు అదృష్టం కూడా కలసి రావాలి. గణేశ్ విషయంలో సరిగ్గా అదే జరిగింది. మందస మండలంలోని భైరిసారంగపురం గ్రామానికి చెందిన మురపాల గణేశ్ ఓ సామాన్య కుటుంబానికి చెందిన విద్యార్థి. తల్లి,దండ్రులు అంతంతమాత్రమే చదివారు. కానీ, వారు కుమారుడిపై ఆశలు పెట్టుకుని చదివించారు. తల్లిదండ్రులు మురపాల నారాయణరావు, తల్లి రేణుక ఆశలను గణేశ్ వమ్ము చేయలేదు. డాక్టర్ కావాలన్న తల్లిదండ్రుల ఆశలకు జీవం పోశాడు. ఎంతో కష్టపడి చదివాడు. ప్రైవేటు కళాశాలలో రూ.కోట్లు కుమ్మరించాల్సి వస్తుందని.. గణేశ్ ఎలాగైనా ప్రభుత్వ సీటు సాధించాలన్న పట్టుదలతో చదివాడు. సరస్వతీదేవి కరుణించింది. చదువు పట్ల గణేశ్ కు ఉన్న అంకితభావానికి ఎంబీబీఎస్ సీటు వచ్చింది. నీట్ లో 558 మార్కులను, ఆల్ ఇండియాలో 37074 ర్యాంకు సాధించాడు. ఆల్ ఇండియా కేటగిరిలో 15048 ర్యాంకు సాధించాడు. అదేవిధంగా 638 స్టేట్ ర్యాంకు సాధించాడు. మొదటి రౌండ్ కౌన్సిలింగ్ లోనే విజయవాడలోని సిద్ధార్థ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు పొందాడు. మారుమూల, వెనుకబడిన ప్రాంతమైన భైరిసారంగపురం నుంచి ఎన్నడూలేని విధంగా ఎంబీబీఎస్ సీటు మురపాల గణేశ్ సాధించడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు ఈ గ్రామం నుంచి డాక్టర్లు లేకపోవడంతో గణేశ్ వైద్యునిగా కాబోతుండడంతో స్థానికులు గణేశ్ ను అభినందిస్తున్నారు. తల్లిదండ్రులు మురపాల నారాయణరావు, రేణుక చేసుకున్న అదృష్టంగా ప్రజలు చెప్పుకుంటున్నారు. నారాయణరావు ఎంపీటీసీగా పని చేసి ఉండడంతో గ్రామస్తులు నారాయణరావు, రేణుక దంపతులకు కూడా అభినందనలు తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో తప్పనిసరిగా స్టడీ అవర్స్



**జలుమూరు, సెప్టెంబరు 7(వార్త):** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల విద్యా ప్రమాణాల మెరుగుదలే లక్ష్యంగా ప్రతిరోజూ తప్పనిసరిగా గంట వ్యవధి పాటు స్టడీ అవర్స్ నిర్వహించాలని మండల విద్యాశాఖాధికారి (ఎంఈఓ) బమ్మిడి మాధవరావు ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం జలుమూరు మండలం ఎలమంచిలి ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహిస్తున్న స్టడీ అవర్స్ తీరును పరిశీలించి, విద్యార్థుల అభ్యసన విధానాన్ని పర్యవేక్షించారు. పాఠశాల సమయం అనంతరం లేదా విద్యార్థులకు అనుకూలమైన సమయంలో ప్రత్యేక అధ్యయన గంటను క్రమం తప్పకుండా నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ సమయంలో విద్యార్థులకు పాఠ్యాంశాలపై సందేహాల నివృత్తి చేయడంతో పాటు, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి పాఠ్యాంశాలను సులభంగా అర్థం చేసుకునేలా ఉపాధ్యాయులు అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని ఎంఈఓ సూచించారు. స్టడీ అవర్స్‌ను సమర్థవంతంగా నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యం పెరగడంతో పాటు పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపునకు ఉపాధ్యాయులు సమిష్టిగా కృషి చేయాలని, విద్యార్థుల పురోగతిని ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆయన సూచించారు.

## ఘనంగా మహతి సాంస్కృతిక కళా సేవా సంస్థ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం

**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 7(వార్త):** కవిటి మండలం ఆర్ బెళగాం లో జానపద సంబరాల మహోత్సవాన్ని పురస్కరించుకొని మహతి సాంస్కృతిక కళాసేవా సంస్థ నూతన పురుష మహిళ కార్యవర్గాలను వ్యవస్థాపకులు తిప్పన ధనుంజయ రెడ్డి, అధ్యక్షులు రంగాల జానకిరామ్ రెడ్డి సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ఇచ్ఛాపురం ఎంపీపీ బోర పుష్ప, నవోదయ యువజన సంఘం, గ్రామ పెద్దలు పూరజనులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# ప్రజాదరణ ఉన్నవారికే టికెట్లు

**- సీనియర్లకు సముచిత ప్రాధాన్యం కల్పిస్తాం**

**- మాజీ మంత్రి ధర్మాన**

**-మున్సిపల్ పోరుపై ధర్మానతో గిరిబాబు భేటీ**



**పలాస, సెప్టెంబరు 7 (వార్త):** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత బల్లా గిరిబాబు ఆదివారం శ్రీకాకుళంలో మాజీ మంత్రి, పార్టీ సీనియర్ నేత ధర్మాన ప్రసాదరావుతో భేటీ అయ్యారు. మున్సిపల్ ఎన్నికల వ్యూహం, అభ్యర్థుల ఎంపిక, పార్టీ బలోపేతం తదితర అంశాలపై ఇరువురు నేతలు చర్చించారు. ఈ భేటీ పలాస రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. గత సార్వత్రిక ఎన్నికల సమయంలో పార్టీలో చోటుచేసుకున్న పరిణామాలను ఇరువురు నేతలు చర్చించారు. కొన్ని శక్తుల కారణంగా సీనియర్లకు తగిన ప్రాధాన్యం దక్కలేదని, దీనివల్ల పార్టీకి నష్టం జరిగిందనే అభిప్రాయాలు వ్యక్తమైనట్లు తెలిసింది. కష్టకాలంలోనూ పార్టీని నమ్ముకుని పనిచేసిన సీనియర్లకు తగిన గౌరవం, బాధ్యతలు కల్పించాల్సిన అవసరాన్ని ఉందన్నారు. గతంలో తనకు ఎదురైన పరిణామాలు, ఇబ్బందులు ఉన్నప్పటికీ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి కొనసాగుతున్నానని బల్లా గిరిబాబు అన్నారు. పదవుల కంటే పార్టీ బలోపేతమే ముఖ్యమని, కార్యకర్తలు, ప్రజల కోసం పనిచేస్తూనే ఉంటానని ఆయన స్పష్టం చేశారు. పార్టీ ఆవిర్భావం నుంచి కష్టకాలంలో పనిచేసిన సీనియర్లను అధిష్ఠానం గుర్తిస్తుందని ధర్మాన ప్రసాదరావు భరోసా ఇచ్చారు. పార్టీ బలోపేతంలో వారి సేవలను వినియోగించుకుంటామని తెలిపారు.

### సామాజిక సమీకరణాలపై చర్చ

పలాస-కాశీబుగ్గ మున్సిపల్ ఎన్నికల్లో సామాజిక సమీకరణాలు కీలకంగా మారే అవకాశంపై కూడా చర్చించారు. ముఖ్యంగా కళింగ, కళింగ కోమటి వర్గాల ఓటర్ల మద్దతు ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని బల్లా గిరిబాబు వివరించారు. వార్డుల వారీగా సామాజిక సమీకరణాలను పరిశీలించి అభ్యర్థులను ఎంపిక చేయాల్సిన అవసరాన్ని ఆయన చూపించారు.

### ప్రజాదరణకే ప్రాధాన్యం

మున్సిపల్ ఎన్నికల్లో కౌన్సిలర్ అభ్యర్థుల ఎంపికలో పార్టీ విధేయతతో పాటు ప్రజాదరణ, క్షేత్రస్థాయిలో అందుబాటు, ప్రజా సమస్యలపై పనిచేసిన తీరును పరిగణనలోకి తీసుకోవాలని గిరిబాబు ప్రతిపాదించారు. స్థానికంగా బలమైన అభ్యర్థులను రంగంలోకి దించితే పార్టీకి ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. అభ్యర్థుల ఎంపికలో క్షేత్రస్థాయి పరిస్థితులు, ప్రజాభిప్రాయం, పార్టీ నాయకులు-కార్యకర్తల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకునే విధానం ఉండేలా చర్యలు తీసుకుంటామని ధర్మాన ప్రసాదరావు అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలపై పార్టీ అధిష్ఠానం ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు. ఈ భేటీలో మాజీ కౌన్సిలర్ రోనంకి వెంకటరమణ, డి. నాగభూషణరావు, వల్లభ వైకుంఠరావు, పి. లక్ష్మణరావు, సాయి తదితరులు పాల్గొన్నారు.

## అంధత్వ నివారణపై అవగాహన




**సోంపేట, సెప్టెంబర్ 7(వార్త):** జాతీయ నేత్రదాన పక్షోత్సవాలలో భాగంగా కొర్లాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అలాగే 104 సిబ్బంది ఆధ్వర్యంలో పాలవలస గ్రామంలో అందత్వ నివారణ పై అవగాహన ర్యాలీతో పాటు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ రోషిణి ఆధ్వర్యంలో జరిగిన వైద్య శిబిరంలో 60 మంది రోగులను పరిశీలించారు. వివిధ సమస్యలు గల రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. అలాగే మానవ శరీరంలో అతి ప్రధానమైన కంటి విషయంలో ప్రతి ఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ మణిమాల,చంద్రశేఖర్,ప్రసన్న,జయవర్మ, రాము,చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## గుండువలస ప్రాథమిక పాఠశాలలో ఆడిట్



**జలుమూరు, సెప్టెంబరు 7(వార్త):** విద్యాశాఖ ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో ఆడిట్ ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు ఆడిట్ సభ్యులు పోలిరాజు, శివకుమార్ తెలిపారు. సోమవారం జలుమూరు మండలం గుండువలస ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు టి. కృష్ణారావు ఆధ్వర్యంలో పాఠశాల ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో అందుబాటులో ఉన్న మౌలిక వసతులు, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, పాఠశాల నిర్వహణ తదితర అంశాలను సభ్యులు పరిశీలించారు. విద్యాశాఖ నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా పాఠశాల పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించి, అవసరమైన వివరాలను నమోదు చేస్తున్నట్లు తెలిపారు. పాఠశాల అభివృద్ధిలో తల్లిదండ్రుల భాగస్వామ్యం కూడా కీలకమని పేర్కొన్నారు. ఆడిట్‌లో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రులతో గ్రామసభ నిర్వహించి, పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల విద్యాభివృద్ధి, అవసరమైన సౌకర్యాల కల్పన వంటి అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. పాఠశాలల్లో మెరుగైన విద్యా వాతావరణం కల్పించడంతో పాటు మౌలిక వసతుల లోపాలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునే ఉద్దేశంతో ఈ ఆడిట్ నిర్వహిస్తున్నట్లు సభ్యులు వివరించారు.

## ఉద్దానాన్ని పట్టి పీడిస్తున్న కిడ్నీ, క్యాన్సర్



**మందస, సెప్టెంబరు 7(వార్త):** ఉద్దానాన్ని కిడ్నీ, క్యాన్సర్ వ్యాధులు పట్టిపీడిస్తున్నాయని, వీటిపై ప్రజలకు చైతన్యం ఎంతో అవసరం ఉద్దాన ప్రాంత విద్యాభివృద్ధి వేదిక నాయకులు కోరారు. ఉద్దాన ప్రాంత విద్యాభివృద్ధి వేదిక(యువీవీ)ఆధ్వర్యంలో జరిగిన విద్యా సదస్సునకు యు.వి.వి. అధ్యక్షుడు కోరాడ లింగమూర్తి అధ్యక్షత వహించారు. మందస మండలంలోని గుడ్డిభద్ర గ్రామంలో జరిగిన ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ ఉద్దానంలో కిడ్నీ వ్యాధి ఓ రాక్షసిలా మారిందన్నారు. కాలక్రమేణా క్యాన్సర్ కూడా వ్యాపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు ప్లాస్టిక్ వాడాకాన్ని నిషేధించాలన్నారు. ముఖ్యవక్తగా రిటైర్డ్ లైబ్రేరియన్ పుక్కల చిరంజీవి మాట్లాడుతూ విద్యార్థికి కఠినమైన శిక్షణతో పాటు ఇంగితం ఉండాలని, అప్పుడే మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు. పిల్లలకు మనం ఇచ్చే ఆస్తి చదువే అని.. ప్రతీ తల్లీ, తండ్రి కొంత సమయం పిల్లలకు కేటాయించాలని తల్లిదండ్రులకు సూచించారు. గౌరవ అధ్యక్షుడు బొడ్డు చిన్నారావు మాట్లాడుతూ తల్లిదండ్రులు టీచర్లతో కనీసం నెలకు ఒకసారైనా కలిసి తమ పిల్లల చదువు తెలుసుకోవాలని సూచించారు. గ్రామంలో విద్యావంతులు, త్రివిధ దళాల్లో ఉన్నత స్థాయిలో ఉన్నవారు ఉన్నారన్నారు. గ్రంథాలయ కన్వీనర్ కుత్తుం ప్రకాశరావు మాట్లాడుతూ ప్రభుత్వ బడులు కాపాడే బాధ్యత విద్యార్థుల తల్లిదండ్రులదేని... వేదిక తమ పూర్తి సహకారం అందిస్తుందన్నారు. పిల్లల్ని సృజనాత్మకంగా వెలికి తీయడానికి వేదిక వివిధ కార్యక్రమాలు చేపట్టిందని, గ్రంథాలయాన్ని ఈ ప్రాంత విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. ప్రధానంగా రెండు వ్యాధులు పీడిస్తున్నాయని అందులో ఒకటి కిడ్నీ కాగా, మరొకటి క్యాన్సర్ అని.. వీటిని మనం దూరంగా ఉండుటకు కొన్ని సూచనలు పాటించాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని చాలా వరకు తగ్గించాలని కోరారు.. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి యంపల్ల కామేశ్వరరావు, కోశాధికారి తంగుడు ఖగేశ్వరరావు, కుత్తుం సుధాకర్, తెప్పల వాసుదేవు, జినగ సీతారామయ్య, దున్న సోమేశ్వరరావు, మడియా వాసు, గ్రామ పెద్దలు దున్న ధర్మారావు, తెప్పల బాబూరావు పాల్గొన్నారు.

## వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠ



**మందస, సెప్టెంబరు 7(వార్త):** మందస మండలంలోని భైరిసారంగపురంలో గల కొత్తవీధిలో గల శ్రీవినాయక నాట్య కళామండలి భజన మందిరం విగ్రహాల ప్రతిష్టా కార్యక్రమం భక్తి, శ్రద్ధలతో జరిగింది. శ్రీ వినాయక నాట్యమండలి భజన మందిరంలో ప్రతిష్ఠాపన మహోత్సవంలో మాజీ మంత్రి గౌతు శ్యామ సుందర శివాజీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రతిష్ఠాపన కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న శివాజీ భక్తి, శ్రద్ధలతో దర్శనం చేసుకున్నారు. అనంతరం నిర్వహించిన అన్నదాన ప్రసాదాన్ని స్వీకరించారు. భక్తిభావం, గ్రామ ఐక్యత సమాజ శ్రేయస్సుకు మూలస్తంభాలని శివాజీ పేర్కొన్నారు. ఉదయం 10.24గంటలకు శివుడు, విఘ్నేశ్వరుడు, విష్ణుమూర్తి, విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమ మహోత్సవాలు జరిగాయి. మధ్యాహ్నం 12గంటల నుంచి ఆలయ ఆవరణలో అన్నప్రసాదం జరిగింది. సాయంత్రం నాలుగు గంటలకు వివిధ ప్రాంతాల నుంచి భజన బృందాలతో భజనా కార్యక్రమం నిర్వహించబడ్డాయి. అదేవిధంగా 8న మంగళవారం భక్తులచే కుంకుమపూజ నిర్వహించబడు తుందని తెలిపారు.

## కస్తూరిబా పాఠశాలను పరిశీలించిన ఎంఈవో



**జలుమూరు, సెప్టెంబరు 7(వార్త):** జలుమూరులోని కస్తూరిబా గురుకుల పాఠశాలను ఎంఈవో-2 ఎంవిఆర్ఎస్ ప్రసాదరావు సోమవారం పరిశీలించారు. పాఠశాలకు చేరుకున్న ఆయన విద్యా బోధన, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, పాఠశాలలో అమలవుతున్న విద్యా కార్యక్రమాలను పరిశీలించారు. ముందుగా పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడిన ఎంఈవో వారి విద్యా సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. వివిధ అంశాలపై విద్యార్థులను ప్రశ్నించి వారి అవగాహన స్థాయిని పరిశీలించారు. పదవ తరగతి విద్యార్థులు పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల అభ్యసన స్థాయికి అనుగుణంగా బోధన చేపట్టి, వారికి సులభంగా అర్థమయ్యే విధానాలను అవలంబించాలని తెలిపారు. బోధనలో మరింత నాణ్యత పెంచేందుకు ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వారి సామర్థ్యాలను మెరుగుపరిచేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఇటీవల నిర్వహించిన ఎఫ్ఎల్ఎన్ శిక్షణ తరగతుల్లో నేర్చుకున్న అంశాలను ఉపాధ్యాయులు సమర్థవంతంగా వినియోగించాలని తెలిపారు. అవసరమైన సందర్భాల్లో ఇతర ఉపాధ్యాయులకు కూడా శిక్షణ, మార్గదర్శకత్వం అందిస్తూ విద్యా ప్రమాణాల పెంపునకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ యశోద పాల్గొన్నారు.

## సత్రాంలో ఘనంగా ముగిసిన కృష్ణాష్టమి వేడుకలు

**- నాలుగు రోజుల పాటు ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు**

**- పల్లకిలో స్వామివారి విగ్రహాన్ని గ్రామంలో ఊరేగింపు**

**- పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు**

**సారవకోట, సెప్టెంబరు 7(వార్త):** సత్రాంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ఆధ్వర్యంలో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. నాలుగు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ ఉత్సవాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం స్వామివారి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పల్లకిలో ఉంచి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భక్తి గీతాలు, జై శ్రీకృష్ణ నామస్మరణల మధ్య గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

నాలుగు రోజుల పాటు జరిగిన వేడుకల్లో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేశారు. ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఉత్సవాల నిర్వహణకు సహకరించిన నిర్వాహకులను ఈ సందర్భంగా పలువురు అభినందించారు.



## నగరంపల్లిలో అక్షరాంధ్ర ముగ్గుల పోటీలు



**వజ్రపుకొత్తూరు/మందస, సెప్టెంబరు 7(వార్త):** వజ్రపుకొత్తూరు మండలంలోని నగరంపల్లి జీపీలో అక్షరాంధ్ర ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఎంపీడీఓ నడిమింటి రమేష్ నాయుడు, ఏపీఎం గొడబ ప్రసాదరావు, ఏపీఎం అరుణ్ కుమార్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ అక్షరాస్యులుగా మారాలన్నారు. నిరక్షరాస్యతను నిర్మూలించడమే అక్షరాంధ్ర ధ్యేయమన్నారు. అక్షరాంధ్ర కార్యక్రమంలోని రంగోలి కార్యక్రమంలో స్వయంశక్తి సంఘాల మహిళలు, సీసీ హరిప్రియ, వీఓఏ ధనలక్ష్మి, మహిళలు పాల్గొన్నారు.

## క్యాన్సర్ బాధిత విద్యార్థి శివకుమార్‌కు సాయం



**మందస, సెప్టెంబరు 7(వార్త):** మందస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకేషనల్ గ్రూప్ లో ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి సారక శివ కుమార్ బ్లడ్ క్యాన్సర్ వ్యాధితో అనారోగ్యానికి గురయ్యాడు. కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, విద్యార్థుల సమక్షంలో శివకుమార్ వైద్య ఖర్చుల నిమిత్తం రూ.1,14,000(లక్షా పద్నాలుగు వేల రూపాయలు) ఆర్థిక సాయాన్ని అందజేశారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థి హాస్పిటల్, మెడికల్ ఖర్చులకు ఎంతగానో ఉపయోగపడుతుందని కళాశాల స్టాఫ్, విద్యార్థులు దాతలను అభినందించారు.

## అభయాంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి రూ.30 వేల విరాళం

**సారవకోట, సెప్టెంబరు 7(వార్త):** కిడిమి పంచాయతీ పరిధిలోని భద్రాచలం గ్రామంలో నిర్మాణంలో ఉన్న శ్రీ అభయ ఆంజనేయస్వామి ఆలయానికి టీడీపీ బీసీ కమిటీ అధికార ప్రతినిధి ధర్మాన తేజ్‌కుమార్ తన వంతు సహాయంగా రూ.30 వేల విరాళాన్ని అందజేశారు. సోమవారం ఆలయాన్ని సందర్శించిన ఆయన అక్కడ కొనసాగుతున్న నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వహకులతో మాట్లాడి, గ్రామ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసానికి కేంద్రంగా నిలవనున్న ఆలయ నిర్మాణం వేగవంతంగా పూర్తవుతున్న నేపథ్యంలో తన వంతు సహకారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం రూ.30 వేల నగదును ఆలయ నిర్వహకులకు విరాళంగా అందజేశారు. ఆలయ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తై భక్తులకు అందుబాటులోకి రావాలని ఆకాంక్షించారు. గ్రామాభివృద్ధితో పాటు ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధికి కూడా ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించిన ధర్మాన తేజ్‌కుమార్‌ను స్థానికులు, ఆలయ నిర్వహకులు అభినందించారు. ఆలయ నిర్మాణానికి పలువురు దాతలు సహకరించడం సంతోషకరమని పేర్కొన్నారు.

# డిజిటల్ బుక్ సమర్థ నిర్వహణకు జిల్లాలో త్రిసభ్య కమిటీ

**- పలాస డివిజన్ నుంచి నర్తు నరేంద్రకు స్థానం**




**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 7(వార్త):** జిల్లాలో అధికార పార్టీ అక్రమాలకు, దోపిడీ కి సహకరిస్తూ, చట్ట నిబంధనలను అతిక్రమించి వైస్సార్సీపీ కార్యకర్తలకు, సాధారణ ప్రజనీకానికి హింసించే పోలీస్, రెవిన్యూ, ఇంజనీరింగ్, రిజిస్ట్రేషన్, స్థానిక సంస్థల, సంక్షేమ శాఖల అధికారులను గుర్తించి, చట్ట నిబంధనలు అనుసరించి వ్యవహరించమని తెలియజేయడం, పద్ధతి మార్చుకోని అధికారులను గుర్తించి అధికార మార్పిడి జరిగి, వైస్సార్సీపీ అధికారం లోనికి వచ్చిన అనంతరం నేడు వారు చేసిన అక్రమాలకు తగిన శాస్తి కల్పించడం కోసం శ్రీకాకుళం జిల్లా వైస్సార్సీపీ అధ్యక్షులు కృష్ణదాస్ అధ్యక్షతన, జిల్లా వైస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో నిర్వహించబడిన కార్యవర్గ సమావేశంలో తీర్మానించారు. అందుకు నిర్దేశించిన నిబంధనలననుసరించి దానికి పూర్తిగా సహకరిస్తామని సభికులందరిచేత ప్రమాణం కృష్ణదాస్ గారు ప్రమాణం చేశారు. తెలుగుదేశం పార్టీ అధికారం లో వున్న కాలంలో అధికారులు అక్రమాలకు పాల్పడడం అధికారం మారిన తరువాత అధికారులు అధికారం పొందిన పార్టీ నాయకున్ని ఆశ్రయించి అధికారం వచ్చిన పార్టీ వద్ద కూడా ప్రాపకం పొందడం జరుగుతున్న నేపథ్యంలో వైస్సార్సీపీ నాయకత్వం ఖచ్చితమైన నిర్ణయాల అమలుకోసం నిర్మాణం తలపెట్టిన కమిటీ ఇది. త్రిమెన్ కమిటీ లో నియమితులైన బిసి విభాగం రాష్ట్ర కార్యదర్శి నరేంద్ర మాట్లాడుతూశ్రీకాకుళం జిల్లాలో అధికారుల చేత ఇబ్బందులు ఎదుర్కొంటున్న కార్యకర్తలకు సాంకేతిక సహకారం అందించగలనని, పాలక వర్గం సూచనలతో ప్రజల హక్కులకు భంగం కలిగించి అక్రమాలకు పాల్పడుతున్న అధికార్లను గుర్తించడం,కూటమి నాయకుల ఆదేశాలతో చట్టాన్ని సైతం అతిక్రమించి వైస్సార్సీపీ కార్యకర్తలను హింసించే అధికారులను గుర్తించడం.తమ విధులను, నిర్ణయాధికారాన్ని కేవలం కూటమి నాయకులను ప్రసన్నం చేసుకోవడం కోసం వినియోగించి ప్రజల హక్కులకు భంగం కలిగించే అధికారులను గుర్తించడం.అధికార పార్టీ ఒత్తిడితో అధికారులు చట్ట వ్యతిరేక విధానాలతో ప్రత్యర్థి పార్టీ కార్యకర్తలను, సాధారణ ప్రజనీకానికి హింసించడం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో వచ్చిన పార్టీ కి అలవాటుఅని ఈ విడతలో కూడా అదే విధానాలను అత్యంత అమానుషంగా వ్యవహారిస్తున్నారని అన్నారు.అధికారులు కూడా అధికార పార్టీ దుర్మార్గాలను అమలుచేస్తూ అధికారం మారిన వెంటనే ఆ పార్టీ లో వున్న తమ బంధువులను వారి సిఫారసుతో మళ్ళీ అధికార స్థానాలు పొందుతున్నారని, ఈ విధానాలనుంచి విడనాడి మరో ప్రాంతములో పనిచేస్తూ అక్కడి వైస్సార్సీపీ కార్యకర్తలకు హింసించి పార్టీ అధికారం లోకి వచ్చిన తరువాత సిఫారసు కోసం వచ్చిన వారిని అనుమతించకుండా గ్రామస్థాయి నాయకుడు నుండీ రాష్ట్ర స్థాయి నాయకుల వరకు ఒకే విధానం అవలంభించి అధికార కూటమికి అనుకూలంగా వ్యవహరించి హింసించిన అధికారులకు తగినశాస్తికి కట్టుబడి ఉండడానికి ఉద్దేశించింది కమిటీఅని అన్నారు. రాజ్యాంగ ఆదర్శాలు, ప్రజాస్వామ్య విలువల పట్ల అమితమైన గౌరవం కలిగిన ధర్మాన ప్రసాదరావు పార్టీ అధ్యక్షులు ప్రియతమ వైఎస్ జగన్మోహన్ రెడ్డి సూచించిన డిజిటల్ బుక్ అంశాన్ని సమర్థవంతంగా, శాస్ట్రీయమైన పద్ధతుల్లో అమలు చేయడానికి చేసిన సూచనల ద్వారా జిల్లాలో మూడు డివిజన్ ల నుండీ ముగ్గురిని తీసుకొని కమిటీ వేసి లోప రహితంగా నిర్వహించడానికి జిల్లా అధ్యక్షులు కృష్ణదాస్ భాధ్యతలు కల్పించారని . వెన్నుపోటు పార్టీ బాధితులైన్ సహచర వైస్సార్సీపీ కార్యకర్తలకు సహకారిగా పనిచేసే అవకాశం కల్పించిన జిల్లా నాయకత్వానికి ధన్యవాదములని చెప్పారు. ఈ సందర్భంగా త్రిమెన్ కమిటీ లో ఎంపిక చేసిన శిమ్మ రాజశేఖర్, నర్తు నరేంద్ర యాదవ్, బుడ్డా మోహన్ రెడ్డి కు ధర్మాన ప్రసాదరావు, ధర్మాన కృష్ణదాస్ లు శాలువాలతో సన్మానించారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## విద్యుత్ సిబ్బందిపై కలెక్టర్‌కి ఫిర్యాదు



**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 7(వార్త):** మండపల్లి గ్రామపంచాయతీ లోని బుడ్డేపుపేట,ఎం. తోటూరు, మండపల్లి లోని నూతన విద్యుత్ స్తంభాలను వేసి 2 సంవత్సరాలు కావస్తుందని కానీ ఇంతవరకు వైర్లను,క్లాంపులను ఇతర సామాగ్రిని వెయ్యకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని స్థానిక ఎలక్ట్రికల్ అధికారులు సిబ్బంది పైన గ్రీవెన్స్ సెల్ లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ కి మండపల్లి మాజీ సర్పంచ్ ప్రతినిధి పిట్ట మామయ్య రెడ్డి పిర్యాదు చేశారు.

## ఎంఈవోకి సన్మానం



**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 7(వార్త):** ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు మండల విద్యాశాఖాధికారి 1 కాకర సూర్యారావు ను ఘనంగా సన్మానించారు.పీఎం శ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఇచ్ఛాపురం కి జిల్లా ఉత్తమ ప్రధానోపాధ్యాయులు గా అవార్డు వచ్చినందున, పాఠశాల తరుపున ఘనంగాసత్కరించారు, ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు ,పాఠశాల యాజమాన్య కమిటీ అధ్యక్షులు, సభ్యులు , విద్యార్థులు పాల్గొన్నారు.

## పింఛన్ల దరఖాస్తులు సచివాలయంలో మాత్రమే ఇవ్వండి



**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 7(వార్త):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్ కి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పిస్తూ అవసమైన నిబంధనలతో ఉత్తర్వులు జారీ చేసి వుందని .ఇచ్ఛాపురం నియోజకవర్గం లోని వివిధ పెన్షన్ లకు అర్హత కలిగిన పౌరులు జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టి అమలుచేసిన సచివాలయం లో నేరుగా వెళ్లి దరఖాస్తు చేసుకొనే అవకాశం మాత్రమే కలదని నియోజకవర్గ వైస్సార్సీపీ సమన్వయ కర్త సాడి శ్యాంప్రసాద్ రెడ్డి అన్నారు.దీనికోసం వెన్నుపోటు పార్టీ నాయకులు దరఖాస్తు దారులను బెదిరిస్తూ "మేము మాత్రమే మీకు పెన్షన్ ఇస్తామని, ముందు మా వద్దకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలని" రప్పించుకొని డబ్బులు కొట్టేసే ప్రయత్నాలు చెయ్యవచ్చనని అభిప్రాయం వ్యక్తం చేశారు.. ఇచ్ఛాపురం నియోజకవర్గం పౌరులు ఎవరూ అటువంటి బెదిరింపులకు బెధరవద్దని, గ్రామ వార్డు సచివాలయం లో అర్హత తో దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ సచివాలయం అధికారులు గానీ, మండల అధికారులు గానీ దరఖాస్తు దారులకు కూటమి నాయకుల వద్దకు వెళ్లి సిఫారసు తీసుకొని రమ్మని సూచిస్తే అటువంటి అధికారి పేరు డిజిటల్ బుక్ లో నమోదుకు పిర్యాదు చేయాలనీ ఆ పార్టీ కార్యకర్తలకి సూచించారు.

## లైసెన్స్ ఉంటేనే చేపల వేట



**హిరమండలం, సెప్టెంబరు 7(వార్త):** హిరమండలం పరిధిలోని వంశధార రిజర్వాయర్‌లో చేపల వేట నిర్వహించే ప్రతి మత్స్యకారుడు తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే ఫిషింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, 2025 నుండి అమలులోకి వచ్చిన ఈ విధానం ప్రకారం 7 సహకార సంఘాల్లోని సుమారు 800 మంది స్థానిక సభ్యులంతా తమ లైసెన్స్‌లను వెంటనే పునరుద్ధరించుకోవాలని మత్స్యశాఖ సహాయ తనిఖీదారు స్పష్టం చేశారు. స్థానికేతరులకు ఇక్కడ వేటాడేందుకు అనుమతి లేదని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో స్థానిక మత్స్యకార సంఘాల నాయకులు స్థానిక విలేకరు లతో మాట్లాడుతూ.. ఇతర జిల్లాల వారు అక్రమంగా చేపల పెంపకం చేపడుతూ, మేత కోసం కోడి వ్యర్థాలను నీటిలో వేయడం వలన నీరు కలుషితమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వంశధార రిజర్వాయర్ నుండి అనేక ప్రాంతాలకు తాగునీరు సరఫరా అవుతున్నందున, ఈ విషపూరిత నీటి వల్ల ప్రజారోగ్యానికి తీవ్ర ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని, అధికారులు తక్షణమే స్పందించి అక్రమ పెంపకందారులపై చర్యలు తీసుకుని తమ ఉపాధితో పాటు ప్రజల ప్రాణాలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

## ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 7(వార్త):** కొలిగాం, పాయితారీ, కీర్తిపురంల్లో పనిచేస్తూ ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు పొందిన వారిని ఘనంగా సన్మానించారు. చంద్రశేఖర్ రానా – (జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు) వలపల సరోజిని (మండల ఉత్తమ ఉపాధ్యా యునిరాలు కీర్తి పురం ) బి . తొటవూరు గుండ్ర యశోద (మండల ఉత్తమ ఉపాధ్యాయనిరాలు) బలరాం పురం స్కూల్ ) లను ఘనంగా సన్మానించారుఎం ఈ వో లు . సూర్యరావు విశ్వనాథం లు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం లో గ్రామస్తులు లోపింటి పద్మనాభం,గిన్ని బాలరాజు, ఉపాధ్యాయులు అంగన్వాడీ సిబ్బంది సచివాలయం సిబ్బంది ఉపాధి హామీ సిబ్బంది స్వయం సంఘాలు తదితరులు పాల్గొన్నారు.

# పీజీఆర్ఎస్ ఫిర్యాదులపై అధికారుల స్పందనేదీ?

**- ఫిర్యాదులను పరిష్కరించకుండానే క్లోజ్ చేస్తున్నారని ఆరోపణ**

**- అక్రమ మైనింగ్, మెడికల్ మాఫియాపై ఫిర్యాదులకు పరిష్కారం లేదన్న ఉమామహేశ్వరరావు**

**- ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని డిమాండ్**



**నరసన్నపేట, సెప్టెంబరు 7(వార్త):** ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్) ద్వారా ప్రజలు అందజేస్తున్న ఫిర్యాదుల పరిష్కారంలో సంబంధిత అధికారుల స్పందన ఆశించిన స్థాయిలో లేదని ప్రజా చైతన్య మండలి రాష్ట్ర సభ్యులు ఉమామహేశ్వరరావు ఆరోపించారు. నరసన్నపేటలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ వేదికలను ఆశ్రయిస్తున్నప్పటికీ, కొన్ని ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టకుండా, సమస్యకు పరిష్కారం చూపకుండానే వాటిని క్లోజ్ చేస్తున్నారని విమర్శించారు. తాను అక్రమ మైనింగ్, మెడికల్ మాఫియా తదితర అంశాలపై పలుమార్లు సంబంధిత అధికారులకు పీజీఆర్ఎస్ ద్వారా ఫిర్యాదులు చేసినట్లు తెలిపారు. అయితే ఇప్పటివరకు వాటిలో ఏ ఒక్క ఫిర్యాదుకు కూడా సరైన పరిష్కారం లభించలేదని ఆరోపించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను కేవలం నమోదు చేయడం లేదా క్లోజ్ చేయడం కాకుండా, వాటి వెనుక ఉన్న సమస్యలను సమగ్రంగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు. పీజీఆర్ఎస్ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలగాలంటే ప్రతి ఫిర్యాదును పారదర్శకంగా విచారించి, బాధితులకు న్యాయం జరిగేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ యంత్రాంగం ప్రధాన బాధ్యతగా భావించి అధికారులు మరింత సమర్థవంతంగా పనిచేయాలని ఆయన సూచించారు.

## ఇచ్ఛాపురం అభివృద్ధిపై మాట్లాడే నైతిక హక్కు వైస్సార్సీపీ నేతలకు లేదు

**- రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ వూనా సంతోష్**



**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 7(వార్త):** ఇచ్ఛాపురం నియోజకవర్గ అభివృద్ధిపై, రైల్వే అంశాలపై మరియు మౌలిక వసతుల కల్పనపై మాట్లాడే కనీస నైతిక హక్కు వైస్సార్సీపీ నేతలకు లేదని రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ వూన సంతోష్ కుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.గత ఐదేళ్ల పాలనలో నియోజకవర్గాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిన వైస్సార్సీపీ నేతలు, ఇప్పుడు కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి తట్టుకోలేక అసూయతో ప్రెస్ మీట్లు పెడుతున్నారని మండిపడ్డారు. వైస్సార్సీపీ నాయకులవి ఎప్పుడూ 'క్రెడిట్ చోరీ' రాజకీయాలేనని ఆయన ఎద్దేవా చేశారు.ఈ సందర్భంగా వూన సంతోష్ కుమార్ నియోజకవర్గ అభివృద్ధిపై పలు వాస్తవాలను వెల్లడించారు: గత వైస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో సురంగి రాజా వారి మైదానంలో నిధులతో స్టేడియం నిర్మిస్తామని చెప్పిన మాటలు కేవలం గాలిమూటలుగానే మిగిలిపోయాయి. కానీ నేడు, కేంద్ర మంత్రివర్యులు, శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు , శాసనసభ్యులు బెందాళం.అశోక్ చొరవ తీసుకుని రూ. 2.29 కోట్ల కోల్ ఇండియా సీఎస్ఆర్ నిధులతో అత్యాధునిక బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియం నిర్మిస్తుంటే వైస్సార్సీపీ నేతలకు కడుపుమంటగా ఉందని విమర్శించారు. ఇచ్ఛాపురం నార్త్ క్యాబిన్ వద్ద అలాగే పాతాళసిద్ధేశ్వర ఆలయానికి వెళ్లే మార్గంలో సుమారు రూ. 6 కోట్లతో ఆర్‌యూబీ (రైల్వే అండర్ బ్రిడ్జ్)లను నిర్మిస్తున్నది, భవిష్యత్తులో ఆర్ఓబీలను నిర్మించబోయేది ముమ్మాటికీ కూటమి ప్రభుత్వమేనని స్పష్టం చేశారు.నియోజకవర్గంలో జాడుపూడి, కరాపాడు లలో మరో రెండు ఆర్ఓబీల నిర్మాణాన్ని కూడా కూటమి ప్రభుత్వమే చేపడుతోందని తెలిపారు. ఐదేళ్ల పాలనలో మత్స్యకారులకు సబ్సిడీపై కనీసం ఒక్క వల కూడా ఇవ్వలేని వైస్సార్సీపీ నేతలకు, నేడు మత్స్యకారుల పేరు ఎత్తే అర్హత కూడా లేదు. వైస్సార్సీపీ మాయమాటలను మత్స్యకారులు నమ్మరనే విషయాన్ని మొన్నటి 2024 ఎన్నికల తీర్పుతోనే ప్రజలు తేల్చిచెప్పారని గుర్తుచేశారు. బారువ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు మన శాసనసభ్యులు ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం.అశోక్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని రూ. 44 లక్షలతో గెస్ట్ హౌస్ నిర్మాణం, రూ. 15 లక్షలతో పార్కింగ్ సదుపాయాలు కల్పించేలా నిధులు మంజూరు చేయించారు. మరి ఐదేళ్ల మీ అధికారంలో బారువ బీచ్‌కి గానీ, ఆ ప్రాంతానికి గానీ మీ పార్టీ చేసింది ఏంటో చెప్పగలరా? అని సవాల్ విసిరారు. ం

వైస్సార్సీపీ అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా కేవలం ప్రెస్ మీట్ల హడావిడికే పరిమితం. పనులు చేయడంలో, అభివృద్ధిని చూపించడంలో ఆ పార్టీ ఎప్పుడూ వెనకడుగేనని,ప్రజల ఆదరాభిమానాలు పొందుతూ నియోజకవర్గాన్ని ప్రగతిపథంలో నడిపిస్తున్న రామ్మోహన్ నాయుడు ని, ఎమ్మెల్యే అశోక్ ని విమర్శిస్తూ కాలం వెళ్లదీయడం తప్ప నియోజకవర్గంలో పాత్ర శూన్యం" అని వూన సంతోష్ కుమార్ ఘాటుగా వ్యాఖ్యానించారు.

## నూతన పింఛన్ల దరఖాస్తులతో సచివాలయాలు కిటకిట



**నరసన్నపేట, సెప్టెంబరు 7(వార్త):** ప్రభుత్వం నూతనంగా పింఛన్లు మంజూరు చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానించడంతో మండలంలోని గ్రామ, వార్డు సచివాలయాలు దరఖాస్తుదారులతో కిటకిటలాడుతున్నాయి. సోమవారం నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కావడంతో అర్హులైన వృద్ధులు, వికలాంగులు, వితంతువులు పెద్ద సంఖ్యలో ఆయా సచివాలయాలకు చేరుకుని దరఖాస్తులు సమర్పిస్తున్నారు. కొత్తగా పింఛను పొందేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించడంతో అర్హత కలిగిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఉదయం నుంచే పలువురు సచివాలయాలకు చేరుకుని అవసరమైన వివరాలను అధికారుల నుంచి తెలుసుకుంటున్నారు. ముఖ్యంగా వృద్ధులు, వికలాంగులు తమ కుటుంబ సభ్యుల సహాయంతో దరఖాస్తుల కోసం సచివాలయాలకు వస్తున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం అవసరమైన అన్ని ధ్రువపత్రాలను వెంట తీసుకువచ్చి దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. అసంపూర్ణ దరఖాస్తులు లేదా అవసరమైన పత్రాలు లేని కారణంగా ఇబ్బందులు తలెత్తకుండా ముందుగానే సంబంధిత సర్టిఫికెట్లను సిద్ధం చేసుకోవాలని కోరుతున్నారు. దరఖాస్తుదారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన ప్రక్రియను సక్రమంగా నిర్వహించేందుకు సిబ్బంది చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ నిర్ణీత గడువులోగా పూర్తి వివరాలు, అవసరమైన ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు కోరారు.

## నర్సరీ మొక్కల పెంపకంపై విద్యార్థులకు అవగాహన




**నరసన్నపేట, సెప్టెంబరు 7(వార్త):** నర్సరీల ద్వారా మొక్కల పెంపకం, వృక్ష సంపద పరిరక్షణపై నేటి విద్యార్థులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పెద్దాడ లత అన్నారు. నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు నర్సరీ మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వృక్షశాస్త్ర అధ్యాపకుడు లక్ష్మీ ప్రసన్న ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు మొక్కల పెంపకం, వాటి సంరక్షణ, నర్సరీల నిర్వహణపై వివరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ పెద్దాడ లత మాట్లాడుతూ, భూమిపై పర్యావరణ సమతుల్యత కొనసాగాలంటే వృక్ష సంపద పెరగడం అత్యంత అవసరమన్నారు. ప్రస్తుతం భూ వైశాల్యంలో సుమారు 21 శాతం మాత్రమే వృక్ష సంపద ఉన్న పరిస్థితి ఆందోళన కలిగిస్తోందన్నారు. పర్యావరణ సమతుల్యతకు కనీసం 33 శాతం మేర అటవీ, వృక్ష సంపద ఉండాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. వాతావరణ మార్పులు, పెరుగుతున్న కాలుష్యం, భూతాపం వంటి సమస్యలను ఎదుర్కోవడంలో మొక్కలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రతి విద్యార్థి మొక్కల పెంపకాన్ని సామాజిక బాధ్యతగా భావించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వామి కావాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు పలు నర్సరీలను సందర్శించి అక్కడ వివిధ రకాల మొక్కల పెంపకం, వాటి సంరక్షణ పద్ధతులు, నర్సరీ నిర్వహణ విధానాలను పరిశీలించారు. ఈ సందర్శన ద్వారా మొక్కల పెంపకంపై ప్రాయోగిక పరిజ్ఞానం పొందే అవకాశం కలిగిందని విద్యార్థులు తెలిపారు.

## ప్రాథమిక దశ నుంచే విద్యార్థుల సామర్థ్యాల అభివృద్ధికి కృషి



**నరసన్నపేట, సెప్టెంబరు 7(వార్త):** ప్రాథమిక విద్యా దశ నుంచే విద్యార్థులలో అభ్యాస సామర్థ్యాలు, మేధో వికాసం మెరుగుపడేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధతో బోధన కొనసాగించాలని మండల విద్యాశాఖాధికారి (ఎంఈవో) ఉప్పాడ శాంతారావు తెలిపారు. నరసన్నపేట మండలం ఉర్లాం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థుల అభ్యాస సామర్థ్యాలను పరిశీలించడంతో పాటు వారి విద్యా ప్రమాణాలపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థులతో మమేకమై నేరుగా పాఠాలు బోధించారు. పలు అంశాలపై విద్యార్థులకు ప్రశ్నలు వేసి వారి అవగాహన స్థాయిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు సరైన పునాది ఏర్పడటం ఎంతో ముఖ్యమన్నారు. చిన్నతనం నుంచే చదవడం, రాయడం, గణితంపై అవగాహన వంటి ప్రాథమిక సామర్థ్యాలను మెరుగుపరిస్తే భవిష్యత్తులో ఉన్నత విద్యను సులభంగా అభ్యసించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రతి విద్యార్థి అభ్యాస స్థాయిని ఉపాధ్యాయులు గుర్తించి, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. బోధనను కేవలం పాఠ్యాంశాలకే పరిమితం చేయకుండా విద్యార్థుల్లో ఆలోచనా శక్తి, ప్రశ్నించే తత్వం, సృజనాత్మకత పెంపొందించే విధంగా తరగతి బోధన సాగాలని పేర్కొన్నారు. పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, ప్రతి విద్యార్థి సామర్థ్యాన్ని వెలికితీసే దిశగా నిరంతరం కృషి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కుమ్మరిపేట పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈఓ

**- ప్రాథమిక దశలో చదవడం, రాయడంపై పట్టు సాధించాలి**

**- విద్యార్థులపై ఉపాధ్యాయులు వ్యక్తిగత శ్రద్ధ చూపాలి**

**- ఆకట్టుకునేలా బోధించాలని సూచన**

**నరసన్నపేట, సెప్టెంబరు 7(వార్త):** కుమ్మరిపేట ప్రాథమిక పాఠశాలను మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) యు.శాంతారావు సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న బోధన, వారి అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. ప్రాథమిక విద్యా దశలోనే విద్యార్థులు చదవడం, రాయడంలో పూర్తి స్థాయి నైపుణ్యాలను సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రతి విద్యార్థి అభ్యసన స్థాయిని గుర్తించి, వెనుకబడిన విద్యార్థులపై వ్యక్తిగతంగా దృష్టి సారించాలని తెలిపారు. బోధనను కేవలం పాఠ్యాంశాలకే పరిమితం చేయకుండా, విద్యార్థులకు ఆసక్తి కలిగించే విధంగా సృజనాత్మక పద్ధతుల్లో పాఠాలు బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తూ వారి మేధో వికాసానికి తోడ్పడాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు కేవలం బోధకులుగానే కాకుండా విద్యార్థుల జీవితాలకు మార్గదర్శకులుగా వ్యవహరించాలని ఎంఈఓ శాంతారావు అన్నారు. విద్యార్థుల్లో మంచి అలవాట్లు, క్రమశిక్షణతో పాటు విద్య పట్ల ఆసక్తిని పెంపొందించే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. పాఠశాల స్థాయిలో విద్యా ప్రమాణాల మెరుగుదలకు ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని సూచించారు.



## నరసన్నపేటలో సెంటర్ లైటింగ్‌కు మరమ్మతులు



**నరసన్నపేట, సెప్టెంబరు 7(వార్త):** నరసన్నపేట మేజర్ పంచాయతీ పరిధిలోని సెంటర్ లైటింగ్ వ్యవస్థ కొన్ని నెలలుగా సక్రమంగా పనిచేయకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రధాన రహదారులు, కూడళ్లలో సరైన వెలుతురు లేకపోవడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. చీకటి కారణంగా రహదారులపై కుక్కలు, పశువులు సంచరిస్తుండటంతో వాహనదారులు పలుమార్లు ప్రమాదాలకు గురైనట్లు స్థానికులు తెలిపారు. ద్విచక్ర వాహనదారులు రాత్రి సమయంలో మరింత జాగ్రత్తగా ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. సెంటర్ లైటింగ్ సమస్యను పరిష్కరించాలని స్థానికులు పలుమార్లు కోరిన నేపథ్యంలో పంచాయతీ అధికారులు స్పందించారు. సమస్య తీవ్రతను గుర్తించిన నరసన్నపేట మేజర్ పంచాయతీ ఇన్‌ఛార్జి ఈవో జగన్మోహనరావు మరమ్మతు పనులకు చర్యలు చేపట్టారు. ఇందుకోసం శ్రీకాకుళం నుంచి ప్రత్యేక సిబ్బందిని రప్పించి పనిచేయని లైట్లను పరిశీలించి మరమ్మతులు చేస్తున్నారు. పంచాయతీ పరిధిలో సెంటర్ లైటింగ్ వ్యవస్థను పూర్తిస్థాయిలో పునరుద్ధరించి, పనిచేయని ప్రతి లైటు వెలిగేలా చర్యలు తీసుకుంటామని ఇన్‌ఛార్జి ఈవో జగన్మోహనరావు తెలిపారు. మరమ్మతు పనులు పూర్తయితే రాత్రి వేళల్లో ప్రజలకు మెరుగైన వెలుతురు సౌకర్యం కలగడంతో పాటు రహదారి ప్రమాదాలు తగ్గే అవకాశం ఉందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546